క్లుప్తంగా

అతివేగం ప్రమాదకరం
ఎస్‌ఐ మధుసూదన్ రెడ్డి



జాతీయ రహదారిని పరిశీలిస్తున్న హైవే అథారిటీ అధికారులు, పోలీసులు

పూడూరు: అతివేగం ప్రమాదకరమని చన్‌గోముల్ ఎస్‌ఐ మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎన్‌హెచ్ 163 బీజాపూర్ నేషనల్ హైవే అథారిటీ అధికారులు నాందేవ్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌లతో రోడ్డు మలుపులు, వివిధ ప్రమాదకర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాల్లో చీకట్లు కమ్ముకున్నాయన్నారు. కొన్ని క్షణాల ఆనందం కోసం సంవత్సరాలపాటుగా క్షోభను అనుభవించాల్సి వస్తుందన్నారు. రోడ్డు భద్రతకు సంబంధించిన పలు సూచనలు, నియమావళిని వాహనాదారులు తెలుసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు జాతీయరహదారి పరిధిలో రాంబుల్ స్ట్రిప్స్, జీబ్రా క్రాసింగ్ లైన్స్, స్టడ్స్‌లను ఏర్పాటుచేయనున్నామన్నారు.

గోర్ మళావోకు సిద్ధం కావాలి
కరపత్రాలు, వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



కరపత్రాలు, గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న రమేశ్‌నాయక్

బొంరాస్‌పేట: గోర్‌సేనా సభ్యులంతా 'గోర్ మళావో–2024'కు సిద్ధం కావాలని గోర్‌సేనా జిల్లా అధ్యక్షుడు రమేశ్‌రాథోడ్ పిలుపునిచ్చారు. ఆదివారం గోర్ సికోడీ, గోర్ సేనా నిర్వహించనున్న గోర్‌మళావోకు దేశవ్యాప్తంగా ఉన్న బంజారాలు పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా సభకు సంబంధించిన కరపత్రాలు, గోడపత్రిలను ఆవిష్కరించారు.

ఆత్మగౌరవ సభను విజయవంతం చేయండి



అనంతగిరి: వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాలమహానాడు నాయకులు

అనంతగిరి: నాగర్‌కర్నూల్ జిల్లాలో ఈ నెల 27న నిర్వహించనున్న ఆత్మ గౌరవ సభను విజయవంతం చేయాలని జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు వెంకటేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం వికారాబాద్‌లోని రైల్వేస్టేషన్ సమీప అంబేడ్కర్ విగ్రహం వద్ద వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రాములుకుమార్, ప్రేంకుమార్ రత్నం, ప్రభాకర్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా
పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మహేశ్ రెడ్డి

కుల్కచర్ల: బీఆర్‌ఎస్ కార్యకర్తలకు పార్టీ అండగా నిలుస్తుందని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. ఆదివారం కుల్కచర్ల మండలం సాల్వీడు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ మాజీ అధ్యక్షుడు హన్మంతు మాతృమూర్తి రాములమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ కొండయ్య, రాజు, సుధాకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వెండి నాగప్రతిమ, త్రిశూలం సమర్పణ

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో నూతనంగా నిర్మించిన కాశీవిశ్వేశ్వర స్వామికి గ్రామానికి చెందిన ఎం వినోద్‌కుమార్ వెండి నాగప్రతిమతోపాటు త్రిశూలాన్ని దేవాలయ నిర్వాహకులకు సమర్పించారు. హస్నాబాద్ గ్రామానికి చెందిన ఎం. వినోద్‌కుమార్ బంజారాహిల్స్ కోర్టు న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్నారు. స్వామివారికి మొక్కు చెల్లించే క్రమంలో ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



దౌల్తాబాద్: ధర్నాలో బీఆర్‌ఎస్ నాయకులు



బొంరాస్‌పేట: తుంకిమెట్లలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

రైతులను మోసం చేసిన ప్రభుత్వం

రైతుభరోసా నిధులు విడుదల చేయకపోవడంతో బీఆర్‌ఎస్ రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం రైతుదీక్ష చేపట్టింది. నియోజకవర్గంలోని ఆయా మండల కేంద్రాల్లో, జాతీయ రహదారిపై బీఆర్‌ఎస్ నాయకులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేయాలన్నారు.



కుల్కచర్ల: చౌడాపూర్‌లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు



కొడంగల్: మాట్లాడుతున్న కౌన్సిలర్ మధుసూదన్ రావ్



మర్పల్లి: రైతుభరోసా డబ్బులు విడుదల చేయాలని ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



పూడురు: మన్నెగూడ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు



దోమ: ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు



బొంరాస్‌పేట: ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

ఉద్యోగాలు సాధించిన వారికి సన్మానం

పరిగి: మాల మహానాడు అంబేడ్కర్ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నూతనంగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారికి ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య మాట్లాడారు. మాలలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని సూచించారు. ప్రభుత్వం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ విజ్ఞానవేదిక జిల్లా అధ్యక్షుడు ముత్యం, నర్సింహులు, వెంకటేష్, రమేష్, హనుమప్ప తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానిస్తున్న సంఘం నాయకులు

నేటి నుంచి అమరవీరుల సంస్మరణ దినోత్సవాలు

అనంతగిరి: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా ఈ నెల 21 నుంచి 31 వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాసరచన, రక్తదాన శిబిరాలు, ఓపెన్‌హౌజ్ తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

మున్నూరు కాపులు ఏకం కావాలి



మాట్లాడుతున్న చంద్రశేఖర్

కొడంగల్: నియోజకవర్గంలోని మున్నూరు కాపులు సమస్యల పరిష్కారం కోసం ఏకం కావాలని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. శనివారం రాత్రి దుద్యాల మండల కేంద్రంలో మున్నూరు కాపు కులస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు బాకారం చంద్రశేఖర్, బి.మల్లయ్య, మున్నూరు బిచ్చప్ప, అరిగె ఓం ప్రకాశ్, శ్యాం సుందర్, సిరుసని చుక్కయ్య, బొంకురు నరేష్ కుమార్‌లు మాట్లాడారు. కుల బంధువులు సంఘటితంగా ఉండాలని సూచించారు. స్థానికంగా ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలన్నారు. మాసుల శశివర్ధన్, వెంకటయ్య పాల్గొన్నారు.

నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

తాండూరు: నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. తాండూరు అభివృద్ధికి రూ. వందల కోట్ల నిధులు తీసుకొస్తున్నానని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం తాండూరు పట్టణంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గొల్ల చెరువులో అమ్మవారి దేవాలయ జాతర ఉత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహర్షి వాల్మీకి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి పాత తాండూరులోని కోటేశ్వర దేవాలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. దేవాలయ ప్రాంగణంలో నూతనంగా ప్రారంభించిన బాలవిహార్ విద్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు తాండూరు పట్టణంలోని అన్ని దేవాలయాలను దర్శించుకున్నానన్నారు. ఈ ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన పురాతన దేవాలయాలు ఉన్నాయన్నారు. దేవుళ్ల కటాక్షం, ప్రజాఆశీర్వాద బలంతో తాండూరును అభివృద్ధి చేసేందుకు అవకాశం వచ్చిందన్నారు. ఏళ్లుగా అధ్వానంగా మారిన రోడ్ల విస్తరణ, సంక్షేమ పనులకు భారీగా నిధులు మంజూరు చేయించానన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, హిందు ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి పట్లోల్ల నర్సింహులు, మున్సిపల్ కౌన్సిలర్లు బొబ్బిలి శోభారాణి, ప్రభాకర్‌గౌడ్, రామకృష్ణ, డాక్టర్ సంపత్‌కుమార్, బంటు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు

కాంగ్రెస్ గిరిజన విభాగం రాష్ట్ర కన్వీనర్ రఘునాయక్



మాట్లాడుతున్న రఘునాయక్

షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే బీఆర్‌ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం రాష్ట్ర కన్వీనర్ రఘునాయక్ అన్నారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు చేపట్టిన బీఆర్‌ఎస్‌కు గత ఎన్నికల్లో ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టారని విమర్శించారు. పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను కుర్చీ వేసుకొని కట్టిస్తానని చెప్పిన కేసీఆర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ భూస్థాపితం కావడం ఖాయమన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితో కొందుర్గుకు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల మంజూరైందన్నారు. ప్రభుత్వంపై, సీఎం రేవంత్‌రెడ్డిపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. బాల్‌రాజ్‌గౌడ్, కృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి



మాట్లాడుతున్న రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట: గ్రంథాలయాల అభివృద్ధికి కృషిచేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పీఆర్టీయూ ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యారంగాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. వారంలో స్థానిక గ్రంథాలయానికి భూమిపూజ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉమ్మడి బొంరాస్‌పేట మండలానికి తమ శాఖ తరఫున సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. దుద్యాల మండలానికి గ్రంథాలయం మంజూరుచేయించి గ్రంథాలయ సేవలు అందిస్తామన్నారు. అనంతరం ఇటీవల పదోన్నతులు, బదిలీలు పొందిన పీఆర్టీయూ సభ్యులకు సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ప్రధానకార్యదర్శి అమర్‌నాథ్, ఎంఈఓలు హరిలాల్, రాంరెడ్డి, విజయరామరావు, మండల అధ్యక్షుడు అనిల్ కుమార్, శశిధర్, శ్రీహరిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, మాజీ వైస్‌ఎంపీపీ శేరినారాయణరెడ్డి, రాంచంద్రారెడ్డి, కిష్టప్ప, అబ్దుల్‌హాఖ్, జలంధర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాధాకృష్ణ, భవానీ పరమేశ్వరి, కవిత, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



బంట్వారం: నాగసాన్‌పల్లి తండాలో సభ్యత్వ నమోదు చేపడుతున్న నందు

బంట్వారం: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వడ్ల నందు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన కోట్‌పల్లి మండలంలోని నాగసాన్‌పల్లితండాలో బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సభ్యత్వ నమోదు లక్ష్యానికి మించి పెద్ద ఎత్తున చేపట్టాలని ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులన్నీ కేంద్రం ఇస్తున్న నిధులేనని అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కృష్ణాయాదవ్, ప్రధాన కార్యదర్శి చంద్రయ్య, జిన్నారం మాజీ ఎంపీటీసీ బందయ్య, రవి, శివకుమార్, రాజు, నాగిరెడ్డి, సర్దార్, హరిప్రసాద్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి బూత్ నుంచి సభ్యత్వాలు చేయించాలి



ధారూరు: ఆన్‌లైన్ సభ్యత్వ నమోదును పరిశీలిస్తున్న మాధవరెడ్డి

ధారూరు: జిల్లాలో అన్ని గ్రామాలు, తండాల్లో ఏర్పాటు చేసిన ప్రతి బూత్ నుంచి ఆన్‌లైన్ సభ్యత్వాలు చేయించాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు మాధవరెడ్డి సూచించారు. ధారూరు మండల పరిధిలోని అవుసుపల్లి, నాగసమందర్ గ్రామాల్లో ఆదివారం ఆన్‌లైన్‌లో చేస్తున్న సభ్యత్వ నమోదును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ బూత్‌లో 200 వరకు సభ్యత్వాలను నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యత్వ ప్రముఖ్ వివేకానందరెడ్డి, ధారూరు మండల అధ్యక్షుడు ఎం. రమేశ్, కోశాధికారి శ్రీనివాస్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాలకు బీఆర్‌ఎస్ అధ్యక్షుడు దూరం



అధ్యక్షుడు లేకుండా నిరసనలో నాయకులు

కుల్కచర్ల: కుల్కచర్ల మండల బీఆర్‌ఎస్‌లో పలు ఆసక్తికర ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. కొంతకాలంగా పార్టీ చేపడుతున్న కార్యక్రమాలకు మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి దూరంగా ఉంటున్నారు. రెండునెలల క్రితం రూ. 2లక్షల రుణమాఫీ అంశంలో నిర్వహించిన నిరసనలో ఆయన పాల్గొనకపోవడం, ఆదివారం రైతుబరోసా అమలుపై కేటీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు నిర్వహించిన నిరసనలోనూ ఆయన పాల్గొనకపోవడంతో మండల బీఆర్‌ఎస్‌లో ఏం జరుగుతుందని నాయకులు చర్చించుకుంటున్నారు. మండల అధ్యక్షుడు బీఆర్‌ఎస్‌లో కొనసాగుతారా? లేదా పార్టీ మారుతారా? అనే సందేహం వ్యక్తం చేస్తున్నారు.

మాలల సభను విజయవంతం చేయండి

కొడంగల్ రూరల్: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరట సమితి ఆధ్వర్యంలో సోమవారం మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించనున్న మాలల చైతన్య సభను విజయవంతం చేయాలని మాల మహానాడు వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.వెంకటేశం పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అక్టోబర్ 14వ తేదీన చేపట్టిన మాలల చైతన్య బస్సు యాత్ర హైదరాబాద్ నుంచి నల్గొండ, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి మీదుగా మహబూబ్‌నగర్ జిల్లాకు చేరుకోనుందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర చైర్మన్ జి.చెన్నయ్య, కో చైర్మన్లు ఎత్తపు కేశవులు, చెరకు రాంచందర్, కరణం కిషన్ తదితరులు నేటి సభకు విచ్చేయనున్నారని తెలిపారు.

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్



చెక్కు అందజేస్తున్న కౌన్సిలర్ రవినాయక్

తుక్కుగూడ: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాటిందని కౌన్సిలర్ బాదావత్ రవినాయక్ అన్నారు. మున్సిపాలిటీకి చెందిన మాధవి అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంది. దీంతో ఆర్థిక సాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకుంది. మాజీ మంత్రి పి.సబితాఇంద్రారెడ్డి చొరవతో మంజూరైన రూ.22,500 వేల చెక్కును ఆదివారం కౌన్సిలర్ ఆమెకు అందజేశారు.

సంక్షిప్త వార్తలు

◆ ప్రభుత్వ భూమిని పరిరక్షించండి

తాండూరు రూరల్: గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిని కాపాడాలని సిరిగిరిపేట్ గ్రామస్తులు కోరారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బిచ్చిరెడ్డి, భద్రు, రాజశేఖర్, పరుశురాం, బాలు, హన్మంత్ తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రజావాణిని సద్వినియోగం చేసుకోండి

బంట్వారం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాములు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే ప్రజావాణిలో ఫిర్యాదు చేయాలన్నారు. ప్రజల సౌలభ్యం కోసం మండల పరిషత్ కార్యాలయంలోనే నిర్వహిస్తారని పేర్కొన్నారు.

◆ సమాజంలో పరివర్తన అవసరం

పరిగి: సమాజంలో పరివర్తన దిశగా మార్పు రావాలని ప్రాంత సహ వ్యవస్థ ప్రముఖ్ తెలంగాణ ఆర్‌ఎస్‌ఎస్ శ్రీమాన్ తిరుమలేష్‌జీ పేర్కొన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని మినీ గ్రౌండ్‌లో ఆర్‌ఎస్‌ఎస్ శతజయంతి ఉత్సవాలను నిర్వహించారు. వందలాది మంది స్వయం సేవులు పట్టణంలో నిర్వహించిన పథసంచలన్ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పరిగి ఖండ సంఘచాలక్ బ్రహ్మయ్య, అతిథి మనోహర్ వైష్ణవ్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఎస్సీ ఉపకులాలకు న్యాయం చేయాలి

బొంరాస్‌పేట: ఎస్సీ ఉపకులాల వర్గీకరణలో హోలియదాసరి కులానికి తగిన రిజర్వేషన్ కల్పించి న్యాయం చేయాలని సంఘం నాయకుడు నాగిరెడ్డిపల్లి వెంకటయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. ప్రస్తుత జనాభా ఆధారంగానే ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద నిరసన దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు.

◆ సీఎం దిష్టిబొమ్మ దహనం

పెద్దేముల్: మంబాపూర్ గ్రామంలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ గుడిలో అమ్మవారి విగ్రహం ధ్వంసం చేసిన నిందితుడిని శిక్షించాలని ధర్నా చేస్తున్న హిందు సంఘాల నాయకులపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని ఖండించారు. దీనికి నిరసనగా మంబాపూర్ చౌరస్తా వద్ద సీఎం దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సందీప్, రాము, వీరు, మారుతి, శంకర్, రవీందర్, రాఘవేందర్‌రెడ్డి, సాయి, నరేష్, లక్ష్మణ్, ప్రకాష్, శివ తదితరులు పాల్గొన్నారు.

◆ రోడ్డు పనుల పరిశీలన

యాలాల: బాగాయిపల్లి నుంచి కమాల్‌పూర్ వరకు చేపడుతున్న రోడ్డు వెడల్పు పనులను ఆదివారం మండల కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. మాజీ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు రఘురాంరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, అమర్, రాంచందర్ తదితరులు పనులను పరిశీలించారు.

◆ ఆర్థిక సాయం

యాలాల: లక్ష్మీనారాయణపూర్ గ్రామానికి చెందిన బోయ శ్రీశైలం ఆదివారం మృతి చెందిన విషయం తెలుసుకున్న పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి ఆర్‌బీఎల్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకవచ్చారు. ఈ సందర్భంగా అంత్యక్రియల నిమిత్తం మృతుడి కుటుంబ సభ్యులకు కృష్ణారెడ్డి, బీవీజీ ఫౌండేషన్ చైర్మన్ సంపత్‌కుమార్ ఆర్థిక సాయం అందజేశారు. సత్యనారాయణరెడ్డి, రమేష్, అంజిలయ్య, వెంకట్రాంరెడ్డి, నగేష్, పాల్గొన్నారు.

◆ ఐనెల్లిలో పత్తిపంట పరిశీలన

తాండూరు రూరల్: ఐనెల్లి గ్రామంలో ఆదివారం రాశీసీడ్స్ కంపెనీ ప్రతినిధులు పత్తి పంటను పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతు బాలకిష్టయ్య రాశీసీడ్స్ కంపెనీ విత్తనాలతో పత్తిపంటను సాగు చేశాడు. ఈ సందర్భంగా మేనేజర్ నాగేశ్వర్‌రావు మాట్లాడారు. రాశీసీడ్స్ రకం పత్తి విత్తనాలు రసం పీల్చే పురుగులను సమర్థవంతంగా తట్టుకుందన్నారు. మొదటి కాపులోనే అధిక దిగుబడి వస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్, రైతులు పాల్గొన్నారు.